క్లుప్తంగా

గంగమ్మ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు



ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేట, ఖిల్లాఘనపురం గ్రామాల్లో గంగమ్మ విగ్రహంతో పాటుగా ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారం కొనసాగాయి. ఆయా గ్రామాల్లోని ఆలయాల ప్రాంగణంలో మంగళవారం అవాహిత దేవతా పుజలు, హోమాలు, ధ్యాన, శయ్య, ఫల, పుష్పాధివాసం తదితర పూజలు చేశారు. మానాజీపేటలో స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దమందడి మండల ఎంపీపీ మేఘారెడ్డి ఉత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు.

కులవృత్తులను కాపాడుకోవాలి

వనపర్తి: కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్‌ఆచారి కోరారు. మంగళవారం స్థానిక బ్రహ్మంగారి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తూ.. రూ.లక్ష అందించే విషయంలో దరఖాస్తు గడువు పెంచాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గడువు ముగియనుందని, కులం, ఆదాయం ధ్రువపత్రాలను పొందటం కోసమే.. ఎక్కువ సమయం పడుతోందని ఆయన చెప్పారు.

దైవ దర్శనానికి ఆసరా పింఛన్‌దారులు



ఖిల్లాఘనపురం: మండలంలోని షాపురం గ్రామానికి చెందిన ఆసరా పింఛన్ లబ్ధిదారులను సర్పంచ్ బాలాంజనేయులుగౌడ్ మంగళవారం దైవ దర్శనానికి తీసుకెళ్లారు. కుమారులు, కుమార్తెలు ఉన్నా కుటుంబ పరిస్థితులు, పనుల వల్ల ఎక్కడికి తీసుకెళ్లలేని స్థితిలో ఉన్న 110 మంది వృద్ధులను యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి చెంతకు తీసుకెళ్లారు. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారం కోరిన వెంటనే రెండు బస్సులను ఏర్పాటు చేశారని సర్పంచు తెలిపారు. వృద్ధులకు అవసరమైన ఖర్చులు సొంతంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సర్పంచ్ దంపతులను వృద్ధులు ఆశీర్వదించగా పలువురు అభినందించారు.

కార్మికుల వేతనాలు పెంచాలి



పెంట్లవెల్లి: జీఓనంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ జిల్లా నాయకుడు ఈశ్వర్‌తో కలిసి ఎంపీడీఓ రామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలో ఆదాయం ఉన్నా ఇవ్వకపోవడం విడ్డూరంగా అందని, పీఆర్సీలో నిర్ణయించిన కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలని, లేదంటే పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 21 తర్వాత సమ్మెకు వెళ్తామని వివరించారు. కార్యక్రమంలో చిట్టెమ్మ, శ్రీనివాసులు, గంగులు, ఈశ్వర్ పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' పేదింటి ఆడబిడ్డకు వరం

కొల్లాపూర్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో మహిళా సంక్షేమ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కొల్లాపూర్, పెంట్లవెల్లి, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాలకు చెందిన 214 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. అలాగే 155 మహిళా సంఘాల సభ్యులకు స్త్రీనిధి రుణాలు రూ.6.12 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష అని.. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషియన్ కిట్లు, అమ్మఒడి, ఆరోగ్యలక్ష్మి, స్త్రీనిధి రుణాలు వంటి అనేక సంక్షేమ పథకాలను మహిళల కోసం అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళల రక్షణ కోసం షీటీమ్స్ ఏర్పాటు చేశామని వివరించారు. మహిళా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ హనుమానాయక్, ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీపీ బోజ్యానాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు కేసిరెడ్డి వెంకటరమణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్లు పెబ్బేటి కృష్ణయ్య, కట్టా రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అందక పరేషాన్

- నిత్యం షాపుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- మూసి ఉంటున్న దుకాణాలు
- సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో డీలర్లు



అమరచింతలో మూసి ఉన్న రేషన్ షాపు

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు సకాలంలో రేషన్ బియ్యం అందకపోవడంతో లబ్ధిదారులు నిత్యం చౌకధర దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. 12వ తేదీ వచ్చినా రేషన్ షాపులకు బియ్యం రాకపోవడంతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్న పరిస్థితులు దాపురించాయి. ఏడు నెలలుగా ట్రాన్స్‌పోర్టు సమస్య అధికంగా వేధిస్తుండటంతో ప్రతి నెల రెండో తేదీన రావల్సిన బియ్యం ఇప్పటి వరకు రాకపోవడంతో డీలర్లు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లబ్ధిదారులు నిత్యం దుకాణం వద్దకు వచ్చి తమను ప్రశ్నిస్తున్నారని, వారికి సమాధానం చెప్పలేక అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

అందుబాటులో లేని లారీలు

అమరచింత మండలానికి మదనాపురం స్టాక్ పాయింట్ నుంచి ప్రతి నెల రేషన్ బియ్యం సరఫరా అవుతుంది. ఈ మధ్య అదనపు బియ్యం కోటాను ప్రభుత్వం అందిస్తుండటంతో రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తున్న ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ సమయానికి లారీలను అందుబాటులోకి ఉంచకపోవడంతో రవాణా భారంగా మారిందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు మదనాపురం సమీపంలోని ఊక చెట్టు వాగుకు వరదలు వస్తే బియ్యం సరఫరా నిలిచి పోతుందని తెలిపారు. మండలంలోని 19 రేషన్ షాపులకు ఇప్పటి వరకు సగం కోటానే బియ్యాన్ని సరఫరా చేయడంతో మిగిలిన బియ్యం కోటా కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. రెండు నెలల కిందటి వరకు సన్న బియ్యం అందంచిన అధికారులు ప్రస్తుతం దొడ్డు బియ్యం అందిస్తున్నారని, వీటిని కూడా సమయానికి అందించలేక పోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆయా రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తున్న సదరు ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే సరఫరాలో జాప్యం అవుతుందని ఆయా గ్రామాల డీలర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సకాలంలో రేషన్ షాపుల ద్వారా బియ్యాన్ని లబ్ధిదారులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

దయాకర్‌రెడ్డి సేవలు మరువలేనివి



అమరచింతలో దయాకర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

అమరచింత: మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి మృతి టీడీపీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మోదీమనోహర్‌రాజు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద మంగళవారం దయాకర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నల్లబ్యాడ్జీలు ధరించి సంతాపం వ్యక్తపరిచారు. నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, పిలిస్తే పలికే నాయకుడిగా ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలుస్తారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రభుదాస్, గోపి, వెంకటేష్, నరసింహ, సవరన్న తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి మృతి పట్ల మంగళవారం పార్టీ నాయకులు ఆయన భౌతికాయాన్నికి ఘనంగా నివాళ్పరించారు. ఈ సందర్భంగా తెలంగాణ టిడిపి సినియర్ నాయకులు సీతార వెంకటేశ్వర్లు భౌతియానికి పూలమాలలు వేసి నివాళ్పరించి ఆయన మృతికి ఆత్మశాంతి కలుగాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రూ.లక్ష సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: ప్రభుత్వం బీసీ కుల, చేతి వృత్తుల వారికి అందజేసే రూ.లక్ష సాయాన్ని ఆయా కులాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ కులాల్లో ముందుగా ప్రకటించిన 15 కులాలతో పాటు ప్రభుత్వం ఇటీవల మళ్లీ 21 కులాలను చేర్పిందని ఆయన తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. రూ.లక్ష సాయానికి అర్హులైన కులాలకు ఈ పథకంపై గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం నూతనంగా చేర్చిన కులాల వివరాల కోసం ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అర్హులందరూ నిర్ణిత గడువులోగా దరఖాస్తులు చేసుకొని ప్రభుత్వ సాయం పొందాలని సూచించారు.

నల్లమట్టి అక్రమంగా తరలిస్తే చర్యలు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

చిన్నంబావి: కృష్ణానది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నల్లమట్టిని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు పరాముల ప్రకాశ్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ ఘనీ్సి రామ్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పెద్దమారు, వెలటూరు గ్రామాల్లో అక్రమంగా నల్లమట్టిని తరలిస్తూ కొందరు రూ.వేలు దండుకుంటున్నారని, వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలలో పదుల సంఖ్యలో టిప్పర్లను నడుపుతూ రోడ్లన్నీ ధ్వంసం చేస్తున్నారని, రోడ్ల దెబ్బతిని దుమ్ము ధూళితో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవి కుమార్, మధు, శివ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సరి చేయండి



బీఎల్ఓలకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ చాంద్‌పాషా

అమరచింత: ఓటరు జాబితాలో ఓటర్ల పేర్లతో పాటు అడ్రస్‌లో తప్పులు ఉంటే వాటిని వెంటనే సరి చేయాలని తహసీల్దార్ చాంద్‌పాషా అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో ఓటరు నమోదుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఇంటింటి సర్వే కోసం బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి ఒక్క బీఎల్ఓ తన ఓటర్ జాబితా ప్రకారం ఇంటింటికీ వెళ్లి జాబితాలోని తప్పులను సరిచేస్తూ కొత్త ఓటరు నమోదు కోసం కృషి చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వేగవంతంగా ఓటరు జాబితా సర్వేను పూర్తి చేసి ఇచ్చిన లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



చిన్నంబావిలో బాధితుడికి చెక్కు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు



వెల్టూర్‌లో..

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌కు చెందిన మన్నెమ్మ (55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీఎమ్మార్ యువజన సభ్యులు మన్నెమ్మ కుటుంబ పరిస్థితిని ఎంపీపీ మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మేఘారెడ్డి రూ.5వేలు పంపించాడు. టీఎమ్మార్ యువజన సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, అడివన్న, వెంకటేష్, కుర్మయ్య, రాములు, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

చిన్నంబావి: మండలంలోని పెద్దమారులో 6 నెలల క్రితం రాత్రి సమయంలో లొంక శేఖర్‌రెడ్డి రైతుకు చెందిన ఎద్దులపాక షార్ట్‌సర్క్యూట్‌కు గురై రెండు కాడెద్దులు చనిపోయాయి. రైతు కుటుంబ పరిస్థితిని స్థానిక సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి విషయం తీసుకెళ్లగా.. స్పందించిన ఎమ్మెల్యే గ్రామానికి ట్రాన్స్‌కో అధికారులను పంపించారు. మృతి చెందిన కాడెద్దులను చూసిన అధికారులు బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం వచ్చేవిధంగా చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మంజూరయిన రూ.40 వేల చెక్కును మంగళవారం సర్పంచ్, ఉపసర్పంచ్‌లు బాధిత కుటుంబానికి ఇప్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవింద్ శ్రీధర్‌రెడ్డి, ఉపసర్పంచ్ బీసన్న, ట్రాన్స్‌కో అధికారులు ఆంజనేయులు, రైతు శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

కొల్లాపూర్: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని 'తెలంగాణ ఉద్యమం.. రాష్ట్ర ఆవిర్భావం' అనే అంశంపై స్థానిక ప్రభుత్వ పీజీ కళాశాలలో మంగళవారం ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ కోర్సులకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. మార్క్‌పోలోనియస్ తెలంగాణ సాధనకు జరిగిన పోరాటాలు.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాతి పరిణామాలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించేందుకే పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీలను అధ్యాపకులు పుట్టా శ్రీనివాసులు, శిరీష తదితరులు పర్యవేక్షించారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాల పంపిణీ



పాన్‌గల్ ఎమ్మార్సీలో ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ

అమరచింత: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ప్రకారం పాఠ్యపుస్తకాలను మంగళవారం సీఆర్సీ కార్యాలయంలో పంపిణీ చేశామని ఎంఈఓ భాస్కర్‌సింగ్ తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం కావడంతో పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు ముందస్తుగా పాఠ్యపుస్తకాలను అందించాలని కలెక్టర్, డీఈఓల ఆదేశాల మేరకు హెచ్ఎంలకు అందించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాంలను అందించడంతో పాటు మెరుగైన విద్య బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మంగళవారం ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని 36 పీఎస్‌లు, మూడు యూపీఎస్‌లు, 11 ఉన్నత పాఠశాలలకు సంబంధించి 17,400 పుస్తకాలకు గాను 17వేల పుస్తకాలు వచ్చాయని, వాటిలో 5వ తరగతి తెలుగు, 4వ తరగతి ఆంగ్లం, 2వ తరగతి ఇంగ్లిష్, గణితం, 1వ తరగతి గణితం, 7వ తరగతి తెలుగు, 10వ తరగతి హిందీ పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేయాలని సూచించారు.



వనపర్తిలో..



అమరచింతలో..

వనపర్తి టౌన్: ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 49,273 పుస్తకాలు అవసరమని, పార్ట్–1లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం కలిపి మొత్తం 35,466 పుస్తకాలకు గాను 31,469 పుస్తకాలు అందాయని, ఇంకా 3,997 పుస్తకాలు అందాల్సి ఉందని తెలిపారు. పార్ట్–2కు సంబంధించి 13,807 పుస్తకాలు మండలానికి రావాల్సి ఉందన్నారు.

నేడు మండల సర్వసభ సమావేశం

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఆవుల శైలజ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహిస్తున్న ఈ సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం అమోఘం



పెబ్బేరు రూరల్: మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీరంగాపురం మండలంలోని నాగరాల సర్పంచ్ నిర్మలకు ఉత్తమ మహిళ అవార్డును సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, రాధాకృష్ణ ఉన్నారు.

గోపాల్‌పేట: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా రేవల్లి సర్పంచ్ గౌతమి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ చేతుల మీదుగా మంగళవారం ప్రశంసా పత్రం అందుకున్నారు. మహిళా అభివృద్ధి మరియు సంక్షేమంలో భాగస్వాములు అయి ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను ఈ అవార్డు లభించిందని గౌతమి తెలిపారు.

పల్లెప్రగతి, హరితోత్సవం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

పాన్‌గల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15వ తేదీన పల్లెప్రగతి, 19వ తేదీన హరితోత్సవం కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెప్రగతితో గ్రామాల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం గణనీయంగా మెరుగుపడిన తీరును గ్రామాల్లో వివరించాలన్నారు. హరితోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాల వారీగా నర్సరీల్లో సిద్ధంగా ఉన్న మొక్కలపై ఆరా తీశారు. విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీఓ కుర్మయ్య, ఎంపీఓ రఘురాములు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే వాల్మీకి విగ్రహ ఏర్పాటు



వాల్మీకి విగ్రహాన్ని పరిశీలిస్తున్న పెద్దలు

పాన్‌గల్: వాల్మీకి విగ్రహం ఏర్పాటు విషయంలో గొడవలు సృష్టించొద్దని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంమూర్తినాయుడు, ఉప సర్పంచ్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం విగ్రహ ఏర్పాటు కమిటీ వారు మాట్లాడుతూ.. గ్రామంలో అందరి ఏకాభిప్రాయంతోనే వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని, ఇటీవలనే గ్రామ పెద్దలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని ఆళ్లగడ్డలో విగ్రహాన్ని పరిశీలించామని తెలిపారు. పెద్దల సూచన మేరకు విగ్రహానికి ఆర్డర్ ఇచ్చామని పేర్కొన్నారు. కానీ కొందరూ తమ లబ్ధి కోసం విగ్రహం ఏర్పాటులో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విగ్రహం ఏర్పాటులో ఏమైనా అనుమానాలు ఉంటే మారోమారు కమిటీ సభ్యులు సమావేశమై సూచనలు, సలహాలు ఇస్తే పాటించేందుకు సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో యుగంధర్ నాయుడు, వెంకటయ్యనాయుడు, లక్ష్మయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విస్తరిస్తున్న విషజ్వరాలు

- రెండేళ్ల బాలుడికి డెంగీ
- అపరిశుభ్రంగా పరిసరాలు
- పట్టించుకోని పాలకులు



ఒకటో వార్డులోని నాగుల బావిలో నిలిచిన మురుగు



పట్టణంలోని ఎనిమిదో వార్డులో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

అమరచింత: పట్టణంలో మళ్లీ డెంగీ జ్వరం పంజా విసురుతోంది. పట్టణానికి చెందిన రెండేళ్ల చక్రపాణి అనే బాలుడికి డెంగ్యూ జ్వరం ఉందని వైద్యాధికారులు వెల్లడించడంతో సోమవారం ఆరోగ్య సిబ్బంది పరిసరాల్లో బ్లీచింగ్‌తో పాటు దోమల నివారణ మందులను పిచికారీ చేశారు. మరి కొద్ది రోజుల్లో వర్షాలు కురవనున్న నేపథ్యంలో మురుగుకాల్వలతో పాటు కాలనీ పరిసరాల్లో మురుగునీటి నిల్వలు ఉండటంతో దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని డీఎంఆర్ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఎనిమిదో వార్డులో నివాసం ఉంటున్న తెలుగు రమేష్ రెండేళ్ల కుమారుడు చక్రపాణి జ్వరంతో వారం రోజులుగా బాధపడుతుండటంతో తల్లిదండ్రులు పాలమూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు నిర్వహించగా బాలుడికి డెంగీ జ్వరం అని చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఎనిమిదో వార్డుతో పాటు ఒకటో వార్డులోని ఆయా వీధుల్లో మురుగుకాల్వ దుస్థితి అధ్వాన్నంగా ఉందని, పందులు విపరీతంగా సంచరిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని పట్టణ శివారు ప్రాంతాలకు తరలించకుండా చోద్యం చూస్తున్నారని మండిపడుతున్నారు.

ధ్రువపత్రాల కోసం జనం ఇక్కట్లు

పాన్‌గల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల వృత్తుల వారికి రూ.లక్ష సాయం అందిస్తుండటంతో దానికోసం అవసరమగు కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం మంగళవారం మండల కేంద్రంలోని మీసేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద సంఖ్యలో జనం గుమికూడారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన జనం ఆయా ధ్రువపత్రాలు పొందడానికి ఉదయం నుంచే కేంద్రాల వద్ద బారులు తీరారు. తహసీల్దార్ కార్యాలయంలో సర్వర్ డౌన్ కావడంతో ధ్రువపత్రాల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుందని కార్యాలయం అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.లక్ష సాయం అందుతుందో లేదో తెలియదు కానీ ధ్రువపత్రాలు పొందడం కష్టంగా మారడంతో పాటు రూ.300 వరకు ఖర్చు అవుతుందని పలువురు అర్హులు వాపోతున్నారు.



పాన్‌గల్‌లో మీసేవా కేంద్రాల వద్ద జనం